ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

నువ్వా నేనా?







వెదురుకుప్పం మండలం కొమరగుంట పంచాయతీ పూలవారికండ్రిగలో ఆదివారం జల్లికట్టు జరిగింది. అల్లిని ఏర్పాటు చేసి, కోడెగిత్తల కొమ్ములకు బహుమతులుగా వాడే వివిధ రకాల పట్టీలు కట్టి అల్లి వైపు వదిలారు. పలువురు యువకులు గిత్తలను నిలువరించి, పట్టీలు దక్కించుకునే ప్రయత్నం చేసిన క్రమంలో కింద పడి గాయాల పాలయ్యారు.జల్లికట్టు చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో పూలవారికండ్రిగ సందడిగా మారింది.

- వెదురుకుప్పం

కలెక్టరేట్‌లో నేటి పీజీఆర్ఎస్ రద్దు

చిత్తూరు(కలెక్టరేట్), సెప్టెంబరు 15 : చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దయింది. మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవుదినం కావడంతో పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమం కూడా రద్దయినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు.

డీపీటీసీ డీఎస్పీగా షానుషేక్

చిత్తూరు, సెప్టెంబరు 15: చిత్తూరు పోలీసు ట్రైనింగ్ సెంటర్(డీపీటీసీ) డీఎస్పీగా షానుషేక్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక్కడ డీఎస్పీగా ఉన్న శ్రావణ్ కుమార్ సాధారణ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న షానుషేక్‌ను నియమించింది.



ప్రదోష క్షేత్రం వద్ద కుర్చీల్లో కూర్చున్న బాలాజీ రెడ్డి బంధుమిత్రులు

శివయ్యా... ఇదేందయ్యా!

ప్రదోష క్షేత్రంలో వైసీపీ నేత కుమార్తె నిశ్చితార్థ వేడుక

కుర్చీలు వేసి మరీ ఆహ్వానితులను కూర్చోబెట్టడంపై విమర్శలు

నాగలాపురం, సెప్టెంబరు 15 : నాగలాపురం మండలంలో ప్రసిద్ధిగాంచిన సురుటుపల్లె పల్లికొండేశ్వర ఆలయంలో ఆదివారం ఆలయ మాజీ చైర్మన్‌ వైసీపీ నాయకుడు బాలాజీ రెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుక జరిగింది.భక్తులు పవిత్రంగా భావించే ప్రదోష క్షేత్రం వద్ద ఎంతటి వారైనా నందీశ్వరుడి ఎదుట నేలపై కూర్చుంటారు. అయితే నిశ్చితార్థ కార్యక్రమానికి వచ్చిన బంధు మిత్రులను, రాజకీయ ప్రముఖులను స్వామివారి సన్నిధి ఎదుట వందకు పైగా కుర్చీలు వేసి కూర్చోబెట్టి కార్యక్రమాన్ని ఎంతో ఆర్భాటంగా చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఆలయంలోని ప్రదోష క్షేత్రంలో పదిహేను రోజులకొకసారి వైభవంగా ప్రదోష పూజలను నిర్వహిస్తారు.ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే వీవీఐపీలు, రాజకీయ ప్రముఖులు పాల్గొని గంటల కొద్దీ స్వామి వారి ఎదుట నేలపై కూర్చుంటారు.సాధారణంగా ఈ ఆలయంలో శుభ కార్యక్రమాలను ఆలయ ఆవరణలోని దేవస్థాన మండపంలో నిర్వహిస్తారు. ఒక వేళ చిన్న పాటి శుభ కార్యక్రమాలను ప్రదోష క్షేత్రంలో నిర్వహించినా.. కార్యక్రమానికి వచ్చే వారు నేలపై కూర్చునేవారు. అయితే బాలాజీ రెడ్డి ప్రదోష క్షేత్రంలో కుర్చీలు వేసి మరీ ఆహ్వానితులను కూర్చోపెట్టడంపై భక్తులు మండి పడుతున్నారు.అంతే కాదు... పల్లికొండేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం దాతల సాయంతో నూతన వసతి గృహాలను ఏర్పాటు చేశారు.అయితే వీటిని ఇంతవరకూ ప్రారంభించకపోయినా.. నిశ్చితార్థ కార్యక్రమానికి వచ్చినవారి కోసం ఈ గదులను ఉపయోగించడం గమనార్హం.



వారం వారం....అరటిపండ్లతో ఆకలిదీర్చి....

వి.కోట నుంచి పేర్నంబట్‌కు వెళ్ళే దారిలోని నాయకనేరి అడవి వద్ద పెద్ద సంఖ్యలో కోతులు ఆకలితో రోడ్డుపైకి వస్తుంటాయి. వాహన చోదకుల వద్ద తిండి కోసం అన్వేషిస్తుంటాయి.అప్పుడప్పుడూ కొందరు కూరగాయలు, పండ్లు తీసుకువచ్చి వాటికి ఇస్తుంటారు.వి.కోటకు చెందిన అన్నదాన సేవా సమితి సభ్యుడు జగదీశ్వర రెడ్డి మాత్రం వారానికోసారి అరటి పండ్లతో వాటి ఆకలి తీరుస్తున్నారు. ద్విచక్ర వాహనంలో ఆయన కన్పించగానే పెద్దసంఖ్యలో కోతులు ఆయన వద్దకు చేరుకుని పండ్ల కోసం ఎగబడతాయి.ఈ ఆదివారం మధ్యాహ్నం కూడా అరటి పండ్లతో వచ్చిన ఆయన చుట్టూ వానరాలు చేరి పండ్లు తీసుకోవడం చూపరులను ఆకట్టుకుంది.

-వి.కోట





వంట నూనెలపై దిగుమతి సుంకం పెంచినట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించడమే తరువాయి. ధరలు అమాంతంగా పెరగడం ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాలకే లీటరుపై రూ.15 నుంచి రూ.20 వరకు పెరిగాయి. వంట నూనె ధరల పెంపుతో గృహిణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొత్త సరుకులపై కాకుండా నిల్వవున్న సరుకును కూడా అధిక ధరలకు విక్రయించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. శని, ఆదివారాల్లో దుకాణాలకు వెళ్లిన వినియోగదారులకు రిక్తహస్తాలు ఎదురయ్యాయి. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు నోస్టాక్ బోర్డును పెట్టి డిమాండ్‌ను సృష్టిస్తున్నారు.

- చిత్తూరు కలెక్టరేట్

వంటనూనెలు సలసల!

● లీటరుపై రూ.25వరకు ధర పెంపు

గాడితప్పనున్న బడ్జెట్

సన్‌ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు శుక్రవారం వరకు రూ.1730. శని, ఆదివారాలకంతా రూ.2000కు చేరింది. లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125-130కి ఎగబాకింది. అంటే లీటరుపై రూ.17 నుంచి రూ.23 వరకు పెరిగింది. 15 లీటర్ల పామోలిన్ నూనె డబ్బా ధర మొన్నటి వరకు రూ.1530 ఉండగా, ఇప్పుడది రూ.1730 దాటింది. మొన్నటి వరకు లీటరు ధర రూ.95 ఉండగా, శనివారానికి రూ.115కు చేరగా లీటరుకు రూ.20 వరకు పెరిగింది. వంటనూనెలు లేకుండా ఆహారపదార్థాల తయారీని ఊహించలేము. ఇప్పుడా వంటనూనె ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతుల వంటింటి బడ్జెట్ ఒక్కసారిగా గాడితప్పే పరిస్థితి ఏర్పడింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతం పెంచేశారు. మొన్నటి వరకు లీటరు ధర రూ.100 - 110 వరకు వుండగా, అవి ఇప్పుడు రూ.125-130కి చేరాయి.

నెలకు రూ.5 కోట్ల అదనపు భారం

చిత్తూరు జిల్లాలో నెలకు సుమారు 30 నుంచి 40 లక్షల లీటర్ల వంటనూనెను వినియోగిస్తున్నట్లు హోల్‌సేల్ డీలర్లు అంచనా వేశారు. ఒక్కసారిగా లీటరుపై కనిష్ఠంగా రూ.15-20 పెరిగినందున నెలకు రూ.5 కోట్లు వరకు వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. దసరా, దీపావళి వంటి ముఖ్య పండుగలు వరుసగా ఉన్న నేపథ్యంలో నూనె వాడకం భారీగా పెరుగుతుంది.

కల్తీకి రెక్కలు

మార్కెట్‌లో వంటనూనె విడి విక్రయాల పేరుతో కల్తీకి అవకాశముంది. రోడ్డు పక్కన ఉండే టిఫిన్ సెంటర్లు, చిన్న హోటళ్ళు, మాంసాహార భోజనం తయారీ దారులు ఎక్కువగా విడినూనెనే కొనుగోలు చేస్తుంటారు.ఈ విడివిక్రయాలను అడ్డం పెట్టుకుని కొంతమంది కల్తీలు విక్రయించే అవకాశాలున్నాయి.

బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచనుందన్న సమాచారంతో మిల్లుల యజమానులు, వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేశారు. రెండ్రోజుల క్రితం డబ్బులు చెల్లించుకుని శనివారం డెలివరి ఇవ్వాల్సిన ట్యాంకర్లకు సంబంధించి మొత్తాన్ని వ్యాపారులకు వ్యాపారసంస్థలు వెనక్కి ఇచ్చేశాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా డబ్బు చెల్లిస్తే సరఫరా చేస్తామని షరతు విధించాయి. దీంతో హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు పెరిగిన ధరల ప్రకారమే విక్రయాలు ప్రారంభించారు. పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ మలేసియా నుంచి మన దేశానికి ఎక్కువగా దిగుమతి అవుతుంది. శని, ఆదివారాలు సెలవులతోపాటు సోమవారం మలేసియా మార్కెట్‌కు సెలవుదినం కావడంతో మంగళవారం వరకు ఆ ధరల పెరుగుదలపై స్పష్టత వచ్చే ఆస్కారం లేదు. సుంకం 12.5 శాతం నుంచి 32.5 శాతానికి పెరిగే అవకాశముందని తెలుస్తోంది.



రికవరీ చేసిన ఫోన్లను చూపిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చాట్‌బాట్‌తో 305 సెల్‌ఫోన్ల రికవరీ

చిత్తూరు, సెప్టెంబరు 15: ఇప్పటి వరకు ఏడు విడతల్లో 2030 ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. ఎనిమిదో విడతలో రూ.66లక్షల విలువ చేసే 305 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. ఈ వివరాలను ఆదివారం ఎస్పీ మణికంఠ చందోలు మీడియాకు తెలిపారు. జిల్లాలో కొంత కాలంగా వందలాది మంది మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ ఫోన్లను రికవరీ చేయడానికి చాట్‌బాట్ బృందం తగిన చర్యలు చేపట్టింది. నెలల వ్యవధిలో ఏపీతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర నుంచి చోరీకి గురైన 66 లక్షల విలువ చేసే 305 ఫోన్లను రికవరీ చేశారు. ఈ ఫోన్లను ఆదివారం పోలీసు అతిథి గృహంలో బాధితులకు అందించారు.

చాట్‌బాట్‌లో నమోదు చేయడమిలా..

మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న వారి ముందుగా 9440900004 నెంబరు వాట్సాప్‌కు హాయ్ లేదా హెల్ప్ అని పంపాలి. ఆ తర్వాత వెల్‌కమ్ టూ చిత్తూరు పోలీసు పేరున ఒక లింకు వస్తుంది. ఆ లింకులో గూగుల్ ఫార్మేట్ ఓపెన్ అవుతుంది. అందులో జిల్లా, పేరు, వయస్సు, తండ్రి, చిరునామా, కాంటాక్టింగ్ నెంబరు, మిస్ అయిన మొబైల్ మోడల్, ఐఎంఈఐ నెంబరు, మొబైల్ మిస్ అయిన ప్లేస్ వివరాలను నమోదు చేయాలి. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.

కన్నులపండువగా కల్యాణం

● వరసిద్ధుడికి టీటీడీ తరపున పట్టు వస్త్రాలు

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 15: కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వినాయకస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రథోత్సవం మరుసటి రోజున తన మానస పుత్రికలైన సిద్ధి,బుద్ధిలతో పెళ్లిపెద్దగా బ్రహ్మ వ్యవహరించి వినాయక స్వామికి వివాహం జరిపిస్తారని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా ఉదయం ఉభయదారులైన కాణిపాకం, తిరువణంపల్లెలకు చెందిన వణిగ వంశస్థుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం కాణిపాక పురవీధుల్లో కలశాలతో పాలను తీసుకొని ఊరేగించారు.అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత





మాంగళ్యాన్ని చూపుతున్న అర్చకులు ధర్మేశ్వర గురుకుల్ - కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లకు పాలాభిషేకం నిర్వహించారు.కల్యాణోత్సవ సందర్భంగా టీటీడీ తరఫున ఈవో శ్యామలరావు వరసిద్ధుడికి పట్టు వస్త్రాలను అందజేశారు.రాత్రి అలంకార మండపంలో ప్రత్యేక కల్యాణ మండప వేదికపైకి వధూవరులను తీసుకొచ్చి మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి వివాహం జరిపించారు.అనంతరం స్వామివారి ఊరేగింపులో భాగంగా గంగుండ్రి మండపం వద్ద స్వామివారు దోపిడికి గురయ్యారు.అత్తవారు కట్టించిన కుడుములు, ఉండ్రాళ్ల, చిల్లర కాసులను భక్తులు దోపిడి చేశారు. ఈ తంతు ముగియగానే కొంత సేపు స్వామివారిని, సిద్ధి,బుద్ధిని గంగుండ్రి మండపం వద్ద ఉంచి విద్యుత్ దీపాలను తొలగించారు. అనంతరం విద్యుత్‌ను పునరుద్ధరించి ఊరేగింపును కొనసాగించారు.ఈ వేడుకలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే మురళీమోహన్,ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి,విద్యాసాగర్ రెడ్డి, రవీంద్రబాబు, ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి,విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఊరేగిన శివ పుత్రుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వరసిద్ధుడు ఆదివారం రాత్రి అశ్వ వాహనంపై భక్తజనులకు దర్శనమిచ్చారు.బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లెలకు చెందిన గొనగుంట బలిజ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉదయం కాణిపాకం పురవీధుల్లో శత కలశాలను పాలతో నింపి వైభవంగా ఊరేగించారు. ఆలయ కల్యాణ వేదికపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు పాలాభిషేకాన్ని నిర్వహించారు.రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకువచ్చాక అలంకార మండపంలో ఉత్సవర్లకు విశేష పూజలు నిర్వహించారు. అనతరం ఉత్సవర్లను అశ్వ వాహనంపై మంగళ వాయిద్యాలు, డప్పుల నడుమ లయబద్ధంగా యువకులు నృత్యం చేస్తూ ఊరేగించారు.



ఆలయ సిబ్బంది భిక్షాటన : వరసిద్ధుడి కల్యాణం జరిపించడం కోసం ఆదివారం మధ్యాహ్నం ఆలయ సిబ్బంది శివపార్వతుల వేషధారణలో కాణిపాక పుర వీధుల్లో భిక్షాటన నిర్వహించారు. అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి భిక్షాటనకు వచ్చిన సిబ్బందికి యాత్రికులు, భక్తులు తమకు తోచిన భిక్ష వేశారు. ఆలయ పరిసర గ్రామాల్లో భిక్షాటన చేసి వచ్చిన నగదు, వస్తువులతో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఈవో గురుప్రసాద్,ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు మణినాయుడు,జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ ఈవో

నేడు ధ్వజావరోహణం : కాణిపాక బ్రహ్మోత్సవాల్లో సోమవారం ధ్వజావరోహణం నిర్వహించనున్నారు.ఉభయదారులుగా ఆలయం తరఫువారే వ్యవహరించనున్నారు. రాత్రి వడాయత్తు ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కాకర్లవారిపల్లెకు చెందిన గాలి ఉమాపతినాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె ఎం.సుజాత ఉభయదారుగా వ్యవహరించనున్నారు.అనంతరం నిర్వహించే స్వామివారి ఏకాంత సేవకు కాణిపాకానికి చెందిన సోమశేఖరరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.

మొగిలి ఘాట్ ప్రమాదంలో
తీవ్రంగా గాయపడ్డ మహిళ మృతి

- మృతురాలి స్వగ్రామం పాపిరెడ్డిపల్లెలో విషాద ఛాయలు


పద్మావతి (ఫైల్ ఫొటో)

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 15: మొగిలి ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పద్మావతి(49) ఆదివారం మృతి చెందింది. ఈమెను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చే ముందే ఆమె గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. వైద్యులు శ్రమించి పీసీఆర్ చేసి బతికించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తమిళనాడులోని రాణిపేట సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమెది గంగాధరనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లె గ్రామం. ఈ విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హన్సికకు దహనక్రియలు పూర్తి

మహారాష్ట్రకు చెందిన అషతోష్, రిక్కీ, వారి పిల్లలు హన్సిక(6), అష్మిత్ యాదవ్(3)లతో కలిసి బెంగళూరులో ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పనులు చేసుకుని జీవిస్తున్నారు. శ్రీవారి దర్శనం కోసం వారు తిరుమలకు వచ్చి బెంగళూరుకు తిరుగు ప్రయాణమవుతుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అషతోష్ కుమార్తె హన్సిక అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలినవారు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులకు మొదటగా చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. హన్సిక మృతదేహాన్ని కూడా వారితోపాటు స్విమ్స్ మార్చురీలో ఉంచారు. ఆదివారం అషతోష్ బంధువులు తిరుపతికి చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో స్థానిక గోవిందధామంలో హన్సికకు దహనక్రియలు నిర్వహించారు. ఈ సమయంలో తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది.

నిలకడగానే కండక్టర్ ఆరోగ్యం

తీవ్రంగా గాయపడిన బస్సు కండక్టర్ చిరంజీవి(34) తమిళనాడులోని రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ముఖానికి ఒకసర్జరీ చేయాల్సి ఉందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

డీసీసీబీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రఘుబాబు



రఘుబాబు - గంగిరెడ్డి

చిత్తూరుకలెక్టరేట్, సెప్టెంబరు 15: ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ చిత్తూరు యూనిట్ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక డీసీసీబీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఏపీసీసీబీ చైర్మన్ సీహెచ్ మాధవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎస్ రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.రఘుబాబు, జిల్లా కార్యదర్శిగా వై. గంగిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా టి. ధనుంజయరెడ్డి, కోశాధికారిగా ఎం.రమేష్, సభ్యులుగా సి.శ్రీదేవి, లక్ష్మీప్రసాద్ నాయుడు, ఎస్.నాగమణి, కె.రాజశేఖర్, ఎ.పవిత్ర, బి.గురునాథం, భువనేశ్వరి, ఎస్.జయశేఖర్, సి.నాగరాజ, కమిటీ గౌరవ సలహాదారుడుగా కె.వెంకటాచలపతి ఎన్నికయ్యారు. బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్, డీజీఎం, ఏజీఎంలు పాల్గొన్నారు.

ఆరుగురు ఏటీఎం దొంగలకు రిమాండ్

పూతలపట్టు, సెప్టెంబరు 15: ఏటీఎంల వద్ద పలువురిని మోసగిస్తూ నగదు దొంగిలిస్తున్న ఆరుగురిని పూతలపట్టు పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్‌రోడ్డులోని డీసీసీబీ బ్యాంకు ఏటీఎం వద్ద రెండ్రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు చెందిన టి.ఎన్. మోహన్, ధనుష్, అనంతపురంకు చెందిన కృష్ణమూర్తి, చిత్రదుర్గంకు చెందిన శివలింగం, ఒంగోలుకు చెందిన సుబ్బారావు, తుంబకూరుకు చెందిన అనిల్‌కుమార్‌లు అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా సీఐ కృష్ణమోహన్ తమ సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, ఏటీఎం వద్ద అమాయకులనుంచి డబ్బులు కాజేస్తున్నట్లు విచారణలో తేలింది. వారి వద్ద నుంచి రూ.1.10 లక్షలు స్వాధీనం చేసుకుని శనివారం వారిపై కేసు నమోదు చేసి చిత్తూరులోని రెండో కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. వీరిపై తెలంగాణ, తమిళనాడు, పలు ప్రాంతాల్లో ఇదేతరహాలో కేసులు నమోదయ్యాయని సమాచారం.

రేపు పాఠశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 15: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం వైద్య ఆరోగ్య, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 19 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా వైద్య ఆరోగ్య, విద్య, ఐసీడీఎస్ శాఖల అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో 5,466 పాఠశాలల్లో చదువుతున్న 3.63 లక్షల మంది విద్యార్థులకు మాత్రలు వేయడం జరుగుతుందని చెప్పారు. తొలిరోజే వంద శాతం పూర్తిచేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్వాణ నారాయణ స్వామి సేవలో నేపాల్ మాజీ ఉపాధ్యక్షుడు



పలమనేరు, సెప్టెంబరు15 : పలమనేరు విష్ణుపురిలో ఉన్న నిర్వాణ నారాయణ స్వామిని ఆదివారం నేపాల్ మాజీ ఉపాధ్యక్షుడు పరామానందఝూ దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పరమానందఝూ నేపాల్ నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చి అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో పలమనేరుకు వచ్చారు. ఆయనతో పాటు నేపాల్‌కు చెందిన ప్రదీప్‌ఖనాల్, సీర్జానా, నేపాల్ పర్యాటకశాఖ మంత్రి మాజీ సలహాదారు డాక్టర్ సుభాష్‌షా, కృష్ణకుమార్ శ్రేష్ఠి, నేపాల్‌కు చెందిన పలువురు నిర్వాణ నారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారికి అర్చకులు, ఆలయ చైర్మన్ సురేష్ పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పరమానందఝూ మాట్లాడుతూ పలమనేరులోని నిర్వాణ నారాయణ స్వామి అచ్చు ఖాట్మండ్‌లోని ఆలయంలో స్వామి వారిని పోలి ఉన్నారని పేర్కొన్నారు.

ఐదుగురు డీఎస్పీలకు పోస్టింగ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 15:తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న సబ్ డివిజన్లకు డీఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు మహిళా పోలీసు స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న బి.ప్రసాద్‌ను చంద్రగిరికి, సీఐడీ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసరావును రేణిగుంటకు, ఏసీబీలో పనిచేస్తున్న వి.గిరిధర్‌ను తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌కు, వీఆర్‌లో ఉన్న డి.మురళీధర్‌ను తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, రాజగోపాల్ రెడ్డిని తిరుపతి పీటీసీకి నియమించింది.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


అఖిల

తవణంపల్లె, సెప్టెంబరు 15: ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. మండలంలోని తెల్లగుండ్లపల్లెకు చెందిన అఖిల(21)కు వివాహమై భర్తతో విడిపోయి పుట్టింట్లో ఉంటోంది. కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో గత వారం కుటుంబ సభ్యులకు తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి పరిసర గ్రామాల్లో, బంధువులు ఉన్నచోట్ల వెతికినా కనపడలేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరింత.. ఇన్‌స్పైర్ కావాలి..!

● ఇప్పటివరకు వచ్చిన నామినేషన్లు 1,351 ● వచ్చేనెల 15వ తేదీవరకు గడువు
● గత ఏడాది నామినేషన్లలో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా టాప్

ఇన్‌స్పైర్ లోగో


నమూనాను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు (ఫైల్ ఫొటో)

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 15: పాఠశాల స్థాయి విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహిస్తోంది. గత ఏడాది ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 5,720 ప్రాజెక్టుల నామినేషన్లు రావడంతో రాష్ట్ర స్థాయిలో చిత్తూరు మొదటి స్థానంలో, దేశ స్థాయిలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. కాగా, గత ఏడాది ఇన్‌స్పైర్ ద్వారా మన జిల్లా విద్యార్థులు రాష్ట్రం, దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా (జపాన్-సకుర)నూ సత్తా చాటారని జిల్లా సైన్స్ అధికారి ఆర్వీ రమణ తెలిపారు. మన విద్యార్థులు రూపకల్పన చేసిన రెండు నమూనాల (ప్రాజెక్టుల)కు పేటెంట్ హక్కులను జపాన్ ప్రభుత్వం తీసుకుందని గుర్తు చేశారు.

విభజన జిల్లాల ప్రాతిపదికన తొలిసారి..

రాష్ట్రంలో జిల్లాల విభజన జరిగిన తర్వాత తొలి సారిగా 31 మండలాల పరిధి కలిగిన చిత్తూరు జిల్లా నుంచి నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. జూలై 16న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ అక్టోబరు 15 నాటికి ముగియనుంది. కాగా ఇప్పటి వరకు రాష్ట్రంలోనే అత్యధికంగా మన జిల్లా నుంచి 1,351 నామినేషన్లు వచ్చాయి. ఇదే పందాను కొనసాగిస్తే మరోసారి చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి..

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి నామినేషన్ దాఖలు చేయొచ్చు. జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, గణిత శాస్త్రం ఉపాధ్యాయులు ప్రత్యేక భూమిక పోషించాల్సి ఉంది. ఉన్నత పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు ప్రాజెక్టుల నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది.

ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక విజ్ఞానం

- రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్


వేమూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మెక్సికో బృంద ప్రతినిధులు, పక్కనే విజయ్ కుమార్ - బీజామృతం, ఘన, ద్రవ జీవామృత తయారీ విధానాన్ని వివరిస్తున్న అధికారులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 15 : ప్రకృతి వ్యవసాయంలో ఆధునిక విజ్ఞానం దాగి ఉందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు మెక్సికో ప్రతినిధుల బృందం ఆదివారం తిరుపతి జిల్లాలో పర్యటించింది. తొలుత కరకంబాడి రోడ్డులోని ఓ హోటల్‌లో బృందంతో సమావేశం జరిగింది. ఏపీ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ(ఏపీసీఎన్‌ఎఫ్), ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రో ఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సెంటర్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇందులో వివరించారు. మెక్సికో బృందంతో పాటు ప్రజాసంస్థల తరఫున పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, రైతులు హాజరయ్యారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాకుండా ప్రజారోగ్యం, భూ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఏపీసీఎన్‌ఎఫ్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని విస్తరించి రసాయన రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సంకల్పించారన్నారు. మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయ విస్తరణ సులభతరమవుతోందన్నారు. మెక్సికో ప్రతినిధి బృంద ప్రతినిధులు మాట్లాడుతూ తమ దేశంలోని వాతావరణ పరిస్థితులను, వ్యవసాయ విధానాలను, పంటల వివరాలను తెలియజేశారు. నౌ పార్టనర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ రైతుసాధికార సంస్థతో భాగస్వామ్యం కావడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రైతుసాధికార సంస్థ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు తిలకించారు. మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్‌మరియా, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రామిరేజ్ పార్దో ఎరికాసోమి, మెక్సికన్ నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు లోపెజ్ మెర్లిన్ డేవిడ్, ఇసైయాస్ సోలాజానో మంజానో, ప్రాగోసో విల్లావిసెన్సియా పాబ్లో, నౌ పార్టనర్స్ ప్రతినిధులు, ఆర్‌వైఎస్‌ఎస్ సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. తర్వాత మెక్సికో బృందం తిరుపతి రూరల్ మండలం వేమూరులో అయ్యప్పనాయుడు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. బీజామృతం, ఘన, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. సి.రామాపురంలో మహిళా సంఘాలు, గ్రామ ఐక్యసంఘాల ప్రతినిధులతో మాట్లాడారు.

గోవిందరాజ స్వామికి పవిత్రాల సమర్పణ



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 15: తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ పవిత్రోత్సవాలలో భాగంగా ఆదివారం అర్చకస్వాములు పవిత్రాలను శాస్త్రోక్తంగా సమర్పించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ, సహస్రనామార్చన జరిగాయి. ఆ తరువాత గోవిందరాజ స్వామి ఆలయంలోని వివిధ దేవతామూర్తులకు అర్చకులు పవిత్రాలను వేదమంత్రాల మధ్య సమర్పించారు. ఉత్సవాలు సోమవారం ముగుస్తాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, తిరుమల పెద్ద జీయర్ స్వాములు, అర్చకులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో...



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: దక్షిణ కైలాసంగా పేరుగాంచిన ముక్కంటీశుడి ఆలయంలో మూడో రోజు ఆదివారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి విశేష అభిషేకాలు చేపట్టారు. పూర్ణాహుతులు సమర్పించారు. ఆలయ అధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్, వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరులో అంకురార్పణ


పుట్టమట్టిని సేకరిస్తున్న అర్చకులు

తిరుచానూరు, సెప్టెంబరు 15: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఆదివారం ఉత్సవాలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ గావించారు. అంతకు ముందు ఫ్రైడే గార్డెన్ నుంచి అర్చకులు పుట్టమట్టిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. సోమవారం పవిత్ర ప్రతిష్ఠ, మంగళవారం పవిత్ర సమర్పణ, బుధవారం పూర్ణాహుతితో ఉత్సవాలు ముగియనున్నాయి. భక్తులు ఒక్కొక్కరు రూ.750 చెల్లించి ఒకరోజు పవిత్రోత్సవాల ఆర్జితసేవలో పాల్గొనవచ్చు. 2లడ్డూలు, 2 వడలు బహుమానంగా అందిస్తారు. ఈ ఉత్సవాల కారణంగా ఆలయంలో ఆర్జిత సేవలు టీటీడీ రద్దు చేసింది.

బాలుడిపై కేసు నమోదు

చిత్తూరు, సెప్టెంబరు 15: బోరు మోటారు స్టార్టర్‌ను చోరీ చేసిన ఓ బాలుడిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. సంతపేట గాండ్లవీధిలోని ఓ ఇంటి వద్ద ఉన్న బోరు స్టార్టర్‌ను ఆదివారం ఓ బాలుడు ఎత్తుకెళుతుండగా స్థానికులు గుర్తించారు. ఆ బాలుడిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు, ఎల్లుండి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 15: పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని తిరువణ్ణామలైకి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 4గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయన్నారు. బుధవారం వేకువజామున 3గంటల వరకు కొనసాగుతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం రిజర్వేషన్ సౌకర్యంతో పాటు నేరుగా వచ్చినవారికి కూడా నాన్‌ఏసీ, ఏసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ముందస్తు రిజర్వేషన్ ద్వారా రాకపోకలకు టిక్కెట్ బుకింగ్ చేసుకుంటే 10శాతం రాయితీ సదుపాయం కల్పించారు. మరిన్ని వివరాల కోసం 9959225686 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో
డిప్లొమా విద్యార్థి దుర్మరణం

● మరో యువకుడికి తీవ్రగాయాలు


వెంకటేష్(పాతచిత్రం)

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో డిప్లొమా విద్యార్థి దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి వద్ద వెంకటగిరి - ఏర్పేడు రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవి నాయక్ తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లికి చెందిన కృష్ణయ్య, ధనమ్మ దంపతులు రైతులు. వీరికి ఇద్దరు కుమార్తెలతో పాటు వెంకటేష్(19) కుమారుడు ఉన్నారు. అనంతపురం జేఎన్‌టీయూలో డిప్లొమా కోర్సు చేస్తున్న వెంకటేశ్ వరుస సెలవులు కావడంతో శనివారం స్వగ్రామానికి వచ్చాడు. పెద్దనాన్న కుమారుడు జయకుమార్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం నైపుణ్య శిక్షణ పొందుతున్నాడు. ఈ ఇద్దరు అన్నదమ్ములు ఆదివారం సొంతపనుల నిమిత్తం వెంకటగిరికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తి మండలం జగ్గరాజుపల్లి నుంచి ఓ ట్రాక్టర్ వెంకటగిరి - ఏర్పేడు రహదారిపైకి ప్రవేశించే సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందగా జయకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు గాయపడిన జయకుమార్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రుయాకు తరలించారు. సీఐ రవినాయక్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో కడతేరిపోవడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు.

ఇక ఫ్రెండ్లీ ఎస్ఆర్వోలు

- ప్రజలకు చేరువగా సబ్ రిజిస్ట్రార్లు



తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియంతో కూడిన ప్రత్యేక ఛాంబర్, ఆదివారం వాటిని తొలగించిన దృశ్యం

తిరుపతి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి) : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో (ఎస్ఆర్వో) రాచరికపు పోకడలకు స్వస్తి పలికేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జిల్లాలో అమల్లోకి వచ్చింది. ఆదివారం సెలవు అయినప్పటికీ జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం, రాజదర్బార్ లాంటి కుర్చీలను తొలగించారు. పార్టీషన్ తీసేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నట్టుగానే సబ్ రిజిస్ట్రార్ల కుర్చీ, టేబుల్‌తో పాటు కార్యాలయానికి వచ్చేవారు కూర్చునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేసే ప్రజలకు తగిన గౌరవం ఉండాలని కూటమి ప్రభుత్వం భావించింది. న్యాయస్థానాల్లో జడ్జిల తరహాలో సబ్ రిజిస్ట్రార్లు కూర్చొనే విధానానికి చెల్లుచీటి పలికింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమైతే వారికి మంచినీరు, టీ ఆఫర్ చేసి గౌరవించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ఉత్తర్వుల మేరకు వెంటనే పనులు ప్రారంభించామని జిల్లా రిజిస్ట్రార్ శ్రీరాములు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. జిల్లాలోని 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దాదాపుగా తొలగింపు పనులు పూర్తి చేశామన్నారు. సోమవారం ప్లాస్టింగ్ వంటి సివిల్ పనులు పూర్తి చేసుకుని, మంగళవారం నుంచి ఫ్రెండ్లీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చూస్తారని చెప్పారు.

భక్తులతో బోయకొండ కిటకిట



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ, దర్శనం కోసం వేచివున్న భక్తులు

చౌడేపల్లె, సెప్టెంబర్ 15: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిట లాడింది. ఉదయాన్నే వేదపండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, దూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

దాడి కేసులో నలుగురి అరెస్టు

● పరారీలో మరొకరు : డీఎస్పీ


నిందితుల వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ సాయినాథ్

చిత్తూరు, సెప్టెంబరు 15: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన నలుగురిని రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. మరోవ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలను రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్యతో కలిసి డీఎస్పీ సాయినాథ్ మీడియాకు తెలిపారు. సంతపేట ఇందిరానగర్‌కు చెందిన వసంత్ తిరుపతిలోని ఓ మారుతీ షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల వసంత్ తల్లి మరణించడంతో 12వ రోజు కార్యానికి చిత్తూరుకు వచ్చాడు. తన పక్కింటి వాళ్లతో కలిసి కట్టమంచి వినాయక నిమజ్జనానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరగా చర్చివీధిలో వెనుక నుంచి ఇందిరానగర్‌కు చెందిన అరుణ్‌కుమార్ అనే వ్యక్తి మరో వాహనంతో ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ అక్కడ వాదులాడుకోగా బంధువులు సర్దిచెప్పడంతో వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఆగ్రహానికి గురైన అరుణ్ కుమార్ తన కుమారులు గిరీష్, యశ్వంత్, అతడి షాపులో పనిచేసే జయరామ్, చిట్టిబాబులతో కలిసి లిల్లీ బ్రిడ్జి వద్ద ఇనుపరాడ్లతో వసంత్‌పై దాడి చేశారు. బాధితుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వసంత్ ఇచ్చిన ఫిర్యాదుతో దాడిచేసిన నలుగురిని ఆదివారం కాణిపాకం క్రాస్ వద్ద పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న యశ్వంత్ కోసం గాలిస్తున్నారు. ఈ తరహా దాడులకు ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో తిరుపతి వాసి మృతి


నాగరాజు మృతదేహం

విజయపురం, సెప్టెంబరు 15: అనుమానాస్పద స్థితిలో నాగరాజు(37) మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని జంబాడ ఆదిఆంధ్రవాడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగరాజుకు 2012లో వివాహమై తిరుపతి ఆటోనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇతను జంబాడ బస్టాండు సమీపంలో రోడ్డు పక్కన చెట్ల మధ్యలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి శవ పరీక్షల నిమిత్తం పోస్టుమార్టంకు పంపారు. మృతుడికి తన అన్న భార్యతో సంబంధం ఉండడంతో స్వగ్రామానికి వెళ్లేవాడని, మృతిపై అనుమానంగా ఉందని భార్య ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ గోవిందరాజులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, Shaik Asma (Old Name), R/o: 7/184-A, Narasarampet, Kodur, Annamayya Dt, A.P. Do Here By Declared I Have Changed My Name As Shaik Aasma (New Name) W/o Shaik Noor.
AJT - 4292

TO-LET
రేణిగుంట రోడ్డు, కొత్త చెక్‌పోస్టు నందు 30x70 గల బిల్డింగ్ అన్ని సౌకర్యాలతో రెస్టారెంట్, బార్‌కు అద్దెకు ఇవ్వబడును. కార్ పార్కింగ్ కలదు. 99595 05753, 97045 82084
AJT - 4293

PLOTS FOR SALE
నాయుడుపేట బస్టాండ్ నుండి 4 కిమీ దూరంలో 6 లైన్స్ హైవేకి 2వ బిట్ అయిన తుడా అప్రూవల్ 43 ఎకరాల మెగా వెంచర్‌లో 1 Sq.Feet 420 రూ. మాత్రమే. సెల్: 99660 66111
AJT-4281

LAND FOR SALE
ఏర్పేడు మండలం గుడిమల్లం, సర్వేనెం. 172 పుంజ, 5 ఎకరాలు సెటిల్మెంట్ భూమి అమ్మబడును. ఎకరా 16 లక్షలు కాంపౌండ్ గేట్ ఇల్లు అమ్మబడను. 99595 05753, 97045 82084
AJT - 4294

RENT / LEASE
తిరుపతి లీలామహల్ సర్కిల్, విజ్ఞేష్ టవర్స్‌లో 501, 502 (2300 sft) కమర్షియల్‌కు ఇవ్వబడును. పూర్తి వివరాలకు సంప్రదించండి. సెల్: 98667 26232
AJT-4270

తుడా అప్రూవల్ ప్లాట్స్
నాయుడుపేటకి దగ్గరలో క్రిష్ణపట్నం పోర్టు రోడ్డు 500మీ లో తుడా అప్రూవల్‌తో 1 ప్లాట్ 45-83 అం. కేవలం 7 లక్షల 60 వేలు పూర్తి డెవలప్ సీసీ రోడ్, కాంపౌండ్ వల్, ఎలక్ట్రిసిటీ, డ్రైనేజీ, గ్రేటెడ్ కమ్యూనిటీ సంప్ర. 95023 75369
AJT-187496

HOUSE FOR SALE
45 Ankanams (Approximately) రెండు అంతస్తుల Semi-Commercial బిల్డింగ్ ఫర్‌సేల్. Near Ramanuja Circle Main Road. Suitable for Guest House, Home Stay, Hostel. Cont. No. 98496 50503
AJT - 4267

వధువు కావలెను
రెడ్డి కులం, వయస్సు : 35, MBA, B.Ed., ఎత్తు-5.9, తిరుపతి. ప్రముఖ వ్యాపార సంస్థ వరుడికి సరైన వధువు కావలెను. సంప్ర. : 91105 49394.
AJT - 187492

TOLET- బాడుగకు
SLV Nagar 1st క్రాస్ నియర్ మానస సరోవర్ ప్రీమియర్ హోటలు సమీపమున డబల్ బెడ్‌రూమ్ హౌస్ ఫుల్‌ఫర్నిచర్‌తో అద్దెకు ఇవ్వబడును. సెల్: 76809 46554, 63008 51356
AJT-4288

PLOT FOR SALE
JP Infra, Tirupati కి 10 కిమీ పరిధిలో భూవరాహ పామ్ ల్యాండ్స్ శ్రీ గంధం మొక్కలతో ప్లాటు అమ్మబడును. ప్లాటులో సుమారు 1 కోటి రూ: అదనపు ఆదాయం వివరాలకు సెల్: 73821 93459, 94415 31587
AJT-136546

FLAT FOR SALE
SUV Non Teaching Colony, Vidyanagar, 2 BHK, 1014 Sq. Feet, West Face with Car Parking in Venkatasai Appartment. Cont. : 99495 35213
AJT - 4278

LEASE/ RENT
రేణిగుంట కొత్త చెక్ పోస్ట్ దగ్గర రన్నింగ్‌లో ఉండే లాడ్జ్ అన్ని వసతులతో (Furniture + A/C) కలిపి లీజుకు ఇవ్వబడును. కావలసినవారు సంప్ర.: 97045 82084.
AJT - 2027

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 198071

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

భావితరాలకు ఆదర్శం మోక్షగుండం



మోక్షగుండం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సునీల్ రాజ్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 15: మోక్షగుండం విశ్వేశ్వరయ్య భావితరాలకు ఆదర్శమని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ అన్నారు. కళాశాలలో ఆదివారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్ రాజ్ మాట్లాడుతూ మోక్షగుండం ఇంజినీర్‌గా మన దేశ ఖ్యాతిని నలుదిశలా చాటారని చెప్పారు. ఆయన మార్గదర్శకత్వంలో చేసిన ఇంజినీరింగ్ నిర్మాణాలు ఇప్పటికీ చెక్కుచెదరలేదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ గంగాధరన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కల్లూరు, సెప్టెంబర్ 15: పులిచెర్ల మండలం కల్లూరు ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 31ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకేచోట చేరడంతో గత అనుభవాలు, జీవన స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, నటరాజ, ఉపాధ్యాయులు రాజేంద్రను ఘనంగా సన్మానించారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



పలమనేరు, సెప్టెంబరు15 : చెన్నైలో ఎక్స్‌ట్రా జీనియస్ అకాడమీ నిర్వహించిన 23వ అబాకస్, వేదిక్ మ్యాథ్స్ కాంపిటీషన్‌లో పలమనేరుకు చెందిన 15మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాణి విద్యాశ్రమ్ నుంచి సమీర్, సందీప్, షణ్ముఖేష్, ఓఎల్ఎల్ స్కూల్ నుంచి శ్రవంతి, లక్ష్మీకాంత్, నారాయణ స్కూల్‌నుంచి విష్ణువర్ధన్, విశ్వభారతి స్కూల్ నుంచి రుత్వికశ్రీ, ఈమాస్‌స్విస్ స్కూల్‌నుంచి గ్రేశీకౌశిక, గ్రీష్మశ్రీ, హేమశ్రీ, కార్తికేయన్, సాయిసాత్విక్, చేతన, దేవేష్‌రెడ్డి, చేతన్‌సాయి పాల్గొని 9 మంది ఛాంపియన్‌షిప్‌ను, మరో 6గురు విన్నర్స్‌గా నిలిచారు. వీరిలో గ్రీష్మశ్రీ సూపర్‌టాపర్‌గా నిలిచి లెనోవా ట్యాబ్‌ను బహుమతిగా గెలుచుకొంది.

మరింత పటిష్టంగా బోయకొండ ఆలయ భద్రత



కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ మణికంఠ చందోల్

చౌడేపల్లె, ఆంధ్రజ్యోతి, సెప్టెంబర్ 15: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ భద్రతను మరింత పటిష్టత చేయనున్నట్లు ఎస్పీ మణికంఠచందోల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనం కోసం మొదటిసారి వచ్చారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేదపండితులు వారికి వేదఆశీర్వదం పలికారు. ఈవో ఏకాంబరం వారిని శాలువలతో సన్మానించి, అమ్మవారి ఫొటో, ప్రసాదాలు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఆలయ భద్రత పెంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ పాల్గొన్నారు.

అహం వీడితేనే మానవజన్మకు సార్థకత



సమావేశంలో మాట్లాడుతున్న మఠం రవిచంద్ర

పలమనేరు, సెప్టెంబరు15 : మానవుడు అహంకారాన్ని వీడిన నాడే మానవ జన్మకు సార్థకత లభిస్తుందని అచాలనంద గురుపీఠ సేవాసమాఖ్య కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు మఠం రవిచంద్ర పేర్కొన్నారు. ఆదివారం పలమనేరు సమీపంలోని కీలపట్ల గ్రామంలో వివేకానంద బండారు సుబ్బాచార్యులు, సూర్యనారాయణ భాగవతార్, సుగుణాంబ వార్షికారాధన పూజా కార్యక్రమంలో రవిచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కేవలం దేహశుద్ధి మాత్రమే కాకుండా ఆత్మశుద్ధి చేసుకోవాలన్నారు.సమాజంలోని ప్రతిఒక్కరిని, జంతువులను, పక్షులను ప్రేమించాలన్నారు. తద్వారా ఆత్మకు దైవత్వానికి ఉన్న సంబంధాలు వాటంతట అవే గోచరిస్తాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ట్రస్టు నిర్వాహకులు శ్రీధరశర్మను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో బండారు లక్ష్మీదేవమ్మ, అరుణ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కోనేటిరాయస్వామి కల్యాణోత్సవం



గంగవరం, సెప్టెంబరు 15 : మండలంలోని కీలపట్ల కోనేటిరాయస్వామి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం నిర్వహించారు.

పేదలకు సేవ చేయడమే 'మానవత' లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్

పుంగనూరు, సెప్టెంబరు15: పేదలకు సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని సంస్థ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు, సంస్థ చేపట్టే పనుల్లో ప్రజలను భాగస్వాములను చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సివుందన్నారు. పేదల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు ఉచితంగా ఇవ్వడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాలను శ్మశానాలకు తీసుకెళ్లడానికి ఉచితంగా శాంతిరథం, ఫ్రీజర్ బాక్స్‌లు అందిస్తున్నామని వివరించారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు నందీశ్వరయ్య, ఆర్.హరినాథరెడ్డి సరస్వతమ్మ, చెంగారెడ్డి, నానబాల గణేశ్, నాగరాజ, హరిప్రసాద్, రెడ్డెప్పరెడ్డి, గంగులమ్మ, వనిత తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా సల్లాపూరెమ్మ గెరిగ



రామకుప్పం, సెప్టెంబర్ 15 : పంద్యాలమడుగు పంచాయతీ పల్లికుప్పంలో వెలిసిన సల్లాపూరెమ్మ ఆలయంలో రెండు రోజులుగా గెరిగె ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం మేళతాళాల మధ్య అమ్మవారికి గ్రామస్థులు పొంగళ్ళు పెట్టి, దీపాలు మోసారు. రాత్రి బాణాసంచా వేడుకలు మధ్య కోలాహలంగా అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి శిరస్సును(గెరిగ) ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం జరిపారు.

గుండెపోటుతో రైతు మృతి

సోమల, సెప్టెంబరు 15: సోమల మండలం నెల్లిమందకు చెందిన టమోటా రైతు సుబ్రమణ్యం గుండె పోటుతో ఆదివారం మృతి చెందారు. ఆదివారం టమోటా తోటలో పనిచేస్తూ గుండెపోటుకు గురై మృతి చెందారు. టీడీపీ, వైసీపీ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

అమ్మవారి ఊరేగింపు



సోమల, సెప్టెంబరు15: మండలంలోని చిన్నసోమల సమీప కనుమలో బోయకొండ గంగమ్మ ఆలయంలో జాతర నేపథ్యంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి పూజలు జరిపారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పుష్ప పల్లకీలో అధిష్ఠింప చేసి చిన్న సోమల, ముంద్రివారిపల్లెలో చెక్క భజనలు, కోలాటాలతో ఊరేగించారు. మహిళలు బోనాలు, పిండి దీపాలతో ప్రదర్శనగా అమ్మవారి ఆలయం చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కొత్తూరు సమీపంలో ఒంటరి ఏనుగు

సోమల, సెప్టెంబరు 15: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ కొత్తూరు ఇర్లపల్లె ప్రాజెక్టు వద్ద ఒంటరి ఏనుగును పశువుల కాపర్లు ఆదివారం గుర్తించారు. దీంతో అక్కడి మేతకోసం వెళ్లిన పశువులను, మేకల మందలను తరుముకుని గ్రామానికి చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రాంతంలోనే గతంలో ఏనుగులు సంచరించాయి.

వరద బాధితులకు కుప్పం టీడీపీ సాయం



కుప్పం, సెప్టెంబరు 15: విజయవాడ వరద బాధితులకు వరుసగా రెండవ రోజు కూడా కుప్పం టీడీపీ నేతలు సహాయం చేశారు. విజయవాడలోని కొన్ని ఏరియాలో ఆదివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, కుప్పం మండ టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో బకెట్, మగ్, ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు, టవల్స్ నైటీ, లుంగీ తదితర నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుప్పం టీడీపీ నాయకులు పార్థసారధి, సత్యేంద్ర, వసంతమ్మ, అనసూయ, స్వావతి, దామోదర్, శివకుమార్, వెంకటేశ్, రమేశ్, రాజ్ కుమార్, జ్యోతి, సుగుణమ్మ, రవిచంద్రబాబు, శాంతమూర్తి, సుభాష్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

వీధికుక్కల పట్టివేత

పలమనేరు, సెప్టెంబరు15 : పలమనేరులో ఆదివారం తిరుపతి అనిమల్ కేర్ ల్యాండ్ సిబ్బంది వీధికుక్కలను పట్టుకొని వాటికి స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ వేసేందుకు తరలించారు. పలమనేరులోని గంగమ్మ గుడివీధి, బజారువీధి, ఎద్దులసంతవీధి, ఎంసీపాల్యం, జిలాని సర్కిల్ ప్రాంతాల్లో వీధికుక్కలను పట్టుకొని తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధికుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేస్తున్నామని, పట్టుకొని వెళ్లి స్టెరిలైజేషన్ అనంతరం తిరిగి విడిచి పెడతారని తెలిపారు.

కుక్కకాటుతో ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 15: వీధికుక్కల కాటుకు ఇద్దరు గాయపడి పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలతో చికిత్స పొందుతున్నారు. ఆదివారం రామసముద్రం మండలం అరికెల గ్రామంలో రమణమ్మ వీధిలో వెళుతుండగా పిచ్చికుక్క కాటు వేసింది. అలాగే పట్టణంలో ఏటిగడ్డపాళ్యంలో రామకృష్ణ కుమారుడు సాయిచరణ్(14)ను వీధికుక్క కాటు వేయడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పుంగనూరు, రామసముద్రం, పెద్దపంజాణి, చౌడేపల్లె మండలాల పరిధిలో జూన్ నెలలో 91 మంది, జూలై నెలలో 73మంది, ఆగస్టు నెలలో 102 మంది, సెప్టెంబరులో ఇప్పటికీ 43మందిని కుక్కలు కాటు వేయడంతో పుంగనూరు ఆసుపత్రిలో చికిత్సలు పొందారు.

రిమ్మర్స్ విద్యార్థులకు అన్నదానం



పలమనేరు, సెప్టెంబరు15 : పలమనేరు సమీపంలోని రిమ్మర్స్ పాఠశాలలోని దివ్యాంగులకు ఆదివారం పట్టణానికి చెందిన వాసుదేవరావు, పద్మలు వారి కుమార్తె హన్సిక పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలకు రిమ్మర్స్ పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం



పుంగనూరు రూరల్, సెప్టెంబరు15: పుంగనూరు-మదనపల్లె మార్గంలోని సుగాలిమిట్ట సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఓ కారు టైర్ పంక్చర్ కావడం, ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించడంతో పెను ప్రమాదమే తప్పింది. వి.కోటకు చెందిన కొందరు వ్యక్తులు మదనపల్లెకు కారులో వెళుతుండగా సుగాలిమిట్ట సమీపంలో కారు టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన గల మట్టిగడ్డకు ఢీకొంది. కారు దెబ్బతిన్నా అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు తగలకపోవడంతో ప్రమాదం తప్పింది.

వరద బాధితులకు లక్ష విరాళం



రామకుప్పం, సెప్టెంబర్ 15 : రామకుప్పం మండలం ఉస్సిగానిపల్లె పంచాయతీలో టీడీపీ నేతలు రామ్మూర్తి, జయశంకర్, కృష్ణారెడ్డి, మహేంద్రనాయుడు, షణ్ముగం, మునేష్‌లు విజయవాడ వరద బాధితులకు సహాయం కోసం నేతలు, కార్యకర్తలు, ప్రజలు, నుంచి విరాళాలు సేకరించారు. రెండు రోజులుగా రూ.1,01,116లు సేకరించినట్లు సీనియర్ నేత రామ్మూర్తి తెలిపారు. ఈ మొత్తాన్ని పార్టీ మండల కమిటీకి అందజేస్తామని ఆయన తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్

- ఒకరు మృతి,
- 25 మందికి గాయాలు
- 8 మంది పరిస్థితి విషమం
- క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ





బోల్తాపడ్డ వ్యాన్, క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి(ఇన్‌సెట్‌లో) మృతి చెందిన సుబ్రమణ్యం

పెద్దపంజాణి,సెప్టెంబరు15: రోడ్డుప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పెద్దపంజాణి మండలంలో చోటు చేసుకుంది. ఆదివారం మారప్పల్లె గ్రామానికి చెందిన 25మంది బైరెడ్డిపల్లె మండలం కొలమాసనపల్లె సమీపం గుండ్లపల్లెలో ఉన్న బంధువు మృతి చెందడంతో వ్యాన్‌లో అక్కడకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వ్యాన్‌లో వస్తుండగా రాయలపేట రోడ్డు గుత్తివారిపల్లె సమీపంలోని దీపిక కోళ్ళఫారాల వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో వస్తున్న పలమనేరు మండలం గడ్దూరు గ్రామానికి చెందిన యల్లప్ప కుమారుడు సుబ్రమణ్యం(50) అక్కడికక్కడే మృతి చెందాడు. సుబ్రమణ్యం కూరగాయలకొత్తపల్లెలోని అత్తారింటికి వెళ్ళి వస్తుండగా ప్రమాదానికి గురై మృత్యువాతపడ్డాడు. బోల్తా పడ్డ వ్యాన్‌లో ఉన్న వెంకటమ్మ(47), సుబ్రమణ్యం(50), వెంకటప్ప(45), బోస్(20), రత్నమ్మ(50), లలిత(35), రాజు(35), లక్ష్మమ్మ(45), కృష్ణప్ప(55), మల్లికార్జున(45), కాంతమ్మ(30), కృష్ణకుమార్(20), అప్పయ్య(30), నరేష్(29), సుబ్రమణ్యం(45)గుర్రప్ప(60), నాగవేణి(45), గురవరాజు(36), సుబ్రమణ్యం(38) తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 8 మంది తీవ్రంగా గాయపడగా చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డ మరికొందరిని 108 అంబులెన్స్, ప్రైవేటు వాహనాల సహాయంతో పోలీసులు పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేసి సుబ్రమణ్యం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పలమనేరు ఆసుపత్రికి తరలించారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే అమర్ పరామర్శ

ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పలమనేరు వైద్యశాలకు తరలించారు. సమయానికి 108 అంబులెన్స్ ఆలస్యం కావడంతో ప్రైవేటు వాహనాలద్వారా గాయపడ్డవారిని తరలించారు. గాయపడ్డ వారందరికి ప్రత్యేక వైద్య సహాయం అందించాలని వైద్యులకు సూచించారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం







పుంగనూరులో ఊరేగుతున్న వినాయక స్వామి, చౌడేపల్లెలో గణేష్ ఊరేగింపు, మాదిగపల్లెలో వినాయకుడి ఊరేగింపు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు15: వినాయక చవితి సందర్భంగా పుంగనూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆదివారం పలుచోట్ల నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని కట్టకిందపాళ్యం,నాగపాళ్యం, ఎన్ఎస్ పేట, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానాలు చేశారు. కొన్నిచోట్ల యువత ఉట్లుకొట్టి రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. విగ్రహాలను ఊరేగిస్తూ పట్టణ సమీపంలోని పాములకుంటకు తరలించి నిమజ్జనం చేశారు.

చౌడేపల్లె : వినాయక యూత్ ఏర్పాటు చేసిన గణేషుడు, నడివీధిగంగమ్మ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు, పలమనేరు రోడ్డులో వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు, గోసలకురప్పల్లెలో వినాయక నిమజ్జనాలు నిర్వహించారు.

సోమల : మండలంలోని దిడ్డివారిపల్లె, పత్రపల్లె, పెద్దఉప్పరపల్లె మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సోమలలో ఆటల పోటీలు నిర్వహించి శెట్టివారి స్వప్న, నవీన్ రాయల్ విజేతలకు బహుమతులు అందజేశారు. చెన్నపట్నం చెరువులో నిమజ్జనం చేశారు.

సదుం : స్థానిక వాల్మీకి వీధిలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యను వైభవంగా నిమజ్జనం చేశారు. బళ్లారి డ్రమ్ములు, యువత నృత్యాల నడుమ కోలాహలంగా పురవీధుల్లో ఊరేగిన బొజ్జ గణపయ్యకు ఇంటింటా పూజలనంతరం స్థానిక కుమారుని ఒడ్డులో నిమజ్జనం చేశారు.

వి.కోట : వి.కోట మండలం కుంభార్లపల్లెలో గణేష్ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. పల్లెకు సమీపంలోని చెరువుకు తరలించారు. వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూకు వేలం పాట నిర్వహించారు.

రొంపిచెర్ల : పెద్దమల్లెల పంచాయతీ తోటిమాదిగపల్లె, నడింపల్లె మోటుమల్లెల పాలెంలో ఆదివారం కోలాహలంగా వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. మంగళవాయిద్యాలతో ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు.



పుంగనూరులో....









చౌడేపల్లె, సదుంలలో ఊరేగుతున్న బొజ్జ గణపయ్య, కుంభార్లపల్లెలో గణేష్ నిమజ్జనం, సోమలలో వినాయక నిమజ్జన ఊరేగింపు

బేలుపల్లెను సందర్శించిన ఎమ్మెల్యే అమర్

పలమనేరు, సెప్టెంబరు15 : బైరెడ్డిపల్లి మండలం బేలుపల్లె గ్రామాన్ని ఆదివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సందర్శించారు. బేలుపల్లెలో అతిసార సోకి మునెమ్మ(60) మృతి చెందగా పలువురు బాధపడుతున్నారని తెలిసి ఆదివారం ఆ గ్రామాన్ని అమరనాథరెడ్డి సందర్శించారు. అతిసారతో మృతి చెందిన మునెమ్మకు నివాళులు అర్పించి ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం పారిశుధ్యం, మురుగునీటి కాలువలు, తాగునీటి పైపులైన్లను పరిశీలించి అతిసారకు దారితీసిన కారణాలను గ్రామస్థుల ద్వారా తెలుసుకొన్నారు. రెండేళ్ళుగా వినియోగించని సింథటిక్ ట్యాంకులోని నీటిని వాడడంతో అతిసార ప్రబలి దాదాపు 15 మంది విరేచనాలకు గురై చికిత్స పొంతుతున్నట్లు గ్రామస్థులు వివరించారు. అదేవిధంగా గ్రామసమీపంలోని చెరువులు కూడా కలుషితం కావడం, ట్యాంకులను శుభ్రపరచకపోవడం అతిసార సోకడానికి కారణమని గుర్తించిన ఆయన వెంటనే పారిశుధ్య పనులతోపాటు,పైపులైను మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో లక్ష్మి, ఎంపీడీవో రాజేంద్రబాలాజి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ లోకనాథం, పంచాయతీ కార్యదర్శి బాలాజి, టీడీపీ మండల అధ్యక్షుడు కిషోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి పాల్గొన్నారు.



అతిసార బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

టీడీపీ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

రొంపిచెర్ల, సెప్టెంబరు 15 : టీడీపీ ప్రభుత్వంతోనే పేదలకు సముచిత న్యాయం జరుగుతుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గానుగచింత పంచాయతీలో ఆయన పర్యటించారు. దాసరి గూడెంలో వైసీపీ ప్రభుత్వంలో తొలగించిన టీడీపీ జెండాను తిరిగి ఎగురవేశారు. దాసరిగూడెంకు చెందిన మాజీ సర్పంచ్ జయరామయ్యతోపాటు వైసీపీ వర్గీయులు పలువురు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా పార్టీ అండదండలు ఉంటాయని, ఎవ్వరూ అధైర్యపడవద్దని చెప్పారు. అలాగే చల్లంపల్లెలోని వాటర్‌షెడ్ అధ్యక్షుడు చంద్రయ్యనాయుడుతో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయశేఖర్‌నాయుడు, జయబ్బనాయుడు, మధుసూదన్‌నాయుడు, వెంకట్రమణ, ప్రతాప్‌నాయుడు, గణేష్, ఎం.నసింహనాయుడు, ఆర్.నరసింహులు తదితరులకు టీడీపీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, రాజంపేట పార్లమెంట్ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ఓబులేశ్వరరెడ్డి, పులిచెర్ల జడ్పీటీసీ మురళీధర్, రామమూర్తి, సోమలశివశంకర్, అమరనాథరెడ్డి, ముద్దుకృష్ణ, కృష్ణమనాయుడు, శంకరనాయుడు, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఓబుల్‌ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చల్లంపల్లెలో చల్లా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

వరద బాధితులకు టీడీపీ నేతల బాసట

శాంతిపురం,సెప్టెంబర్15: విజయవాడ వరద బాధితులకు సొన్నేగానిపల్లె పంచాయతీ టీడీపీ నేతలు బాసటగా నిలిచారు. ఎంకేపురం, సొన్నేగానిపల్లె పంచాయితీల యూనిట్ ఇన్‌చార్జి బాలు ఆధ్వర్యంలో నేతలు ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడుకు రూ. 2,55,000 అందించారు. కూతగానిపల్లెకు చెందిన కృష్ణమూర్తి రూ.60వేలు, గుండిశెట్టిపల్లె వేదశ్రీ, ఉమాపతి రూ.60వేలు, సర్పంచ్ పుష్పవతి, మంజునాథరెడ్డి రూ.25వేలు, మండల వక్కలిగ కుల సంఘం అధ్యక్షుడు మునేగౌడు రూ.20వేలు, సొన్నేగానిపల్లె సోమారెడ్డి రూ.15వేలు ఇతర టీడీపీ నేతలు కలిపి రూ.2,55,500 ఆర్థిక సాయం చేశారు. అలాగే అనెకర పంచాయతీ నేతలు రూ.20 వేలు, కోనేరుకుప్పం పంచాయతీ నేతలు రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ నాగరాజు, టీడీపీ నేతలు పివి నాగరాజు, ఈడిగ శివశంకర్‌గౌడు, బాబు, జయారెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



'లెక్క' తేలకేనా..?



అసంపూర్తిగా ఉన్న డీఎంపురం గ్రామ సచివాలయ భవన నిర్మాణం

వెదురుకుప్పం, సెప్టెంబరు 15: భవన నిర్మాణానికి రావాల్సిన 'లెక్క' రాక.. చేసిన పనికి 'లెక్క' తేలక.. మొండిగోడలతో గ్రామ సచివాలయ భవనం దర్శనమిస్తోంది. కార్వేటినగరం మండలం డీఎంపురంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది. రూ.45 లక్షల నిధులతో పనులు చేపట్టి.. కొంతవరకు నిర్మాణాన్ని పూర్తిచేసి, ఆపేశారు. దీంతో గ్రామ సచివాలయానికి సొంత భవన వసతి కలగా మారింది. వైసీపీ ప్రభుత్వ హయంలో సకాలంలో నిధులు రాకపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది.

250 మందికి వైద్య పరీక్షలు



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 15: ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని వైదేహి హాస్పిటల్ మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ నానబాల లోకేష్ తెలిపారు. శిబిరంలో 250మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, ఈసీజీ, ఎకో, క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించామని పేర్కొన్నారు. జనసేన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాజసేవ కోసమే విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు

చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు



సమావేశంలో ప్రసంగిస్తున్న రాఘవేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 15: సమాజ సేవ చేయాలనే సంకల్పంతోనే విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఆవిర్భవించిందని చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. ఆదివారం చిత్తూరులో 53వ శాఖను సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ (హైదరాబాదు) బ్యాంకు చైర్మన్ పి.ఆర్.వీపీఎస్ రంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రూ.కోటి డిపాజిట్ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో చలసాని మాట్లాడుతూ.. ఆర్బీఐ అనుమతితో త్వరలో బాపట్ల, తాడేపల్లిగూడెంలో బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. అన్ని జిల్లాకేంద్రాల్లో బ్రాంచులు ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. బ్యాంకు మాజీ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ.. వందేళ్లకు మించి చరిత్ర కలిగిన చిత్తూరు కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు తమ బ్యాంకులో విలీనం అయితే పూర్వపు వైభవాన్ని తీసుకొచ్చేందుకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల చైర్మన్లు నాగేంద్రసాయి (నెల్లూరు), శ్రీనివాస్ (కోయిలకుంట్ల), కె.జయచంద్రారెడ్డి (తిరుపతి), వెంకటసుబ్బా రెడ్డి (ప్రొద్దుటూరు), బ్యాంకు డైరక్టర్లు స్టాలిన్, వెంకటరమణ, ప్రసాద్‌రావు, సత్యనారాయణమూర్తి, కోటేశ్వరరావు, నారాయణస్వామి, రామకృష్ణ, బ్యాంకు సీఈవో వరలక్ష్మి, బ్యాంకు జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ సురేష్, చిత్తూరు నగరానికి సంబంధించిన ప్రముఖులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పరమత సహనమే ప్రవక్త బోధన



గంగనపల్లె మసీదులో ఉపన్యసిస్తున్న ప్రభుత్వ ఖాజీ నయీముల్లా

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 15: ముస్లిం ప్రవక్త జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని అన్ని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గంగనపల్లె మసీదులో ప్రభుత్వ ఖాజీ నయీముల్లా మాట్లాడుతూ.. పరమత సహనమే మహమ్మద్ ప్రవక్త బోధన అని, ప్రతి ముస్లిం పాటించాలని కోరారు. సోమ, మంగళవారాల్లో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అసార్‌వీధిలోని మసీదులో ప్రవక్త కేశాలను భక్తుల సందర్శనార్థం ఉంచుతారు.

అద్భుతాలను సృష్టించిన ఘనత విశ్వేశ్వరయ్యదే..!



మోక్షగుండం విగ్రహానికి ఇంజనీర్ల పుష్పాంజలి

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 15: సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే నిర్మాణ రంగంలో అద్భుతాలను సృష్టించిన ఘనత మోక్షగుండం విశ్వేశ్వరయ్యదేనని ఆర్అండ్‌బీ డీఈ దస్తగిరి అన్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా చిత్తూరు ఆర్కిటెక్ట్స్ అండ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డేని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆర్అండ్‌బీ అధికారులు, చిత్తూరు ఆర్కిటెక్ట్స్ అండ్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.జయప్రకాష్, కార్యదర్శి ఎల్.విజయకుమార్, కోశాధికారి కె.గుణశేఖర్, సభ్యులు ఎన్.జ్యోతీశ్వరన్, సురేంద్రరెడ్డి, కేదార్‌నాథ్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావంతో ఎండిన వేరుశనగ పంట



యాదమరి, సెప్టెంబరు 15: మండలంలోని వేరుశనగ పంట తీవ్ర వర్షాభావం కారణంగా ఎండిపోతోంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. మండలవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 1230 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. జూన్, జూలై నెలల్లో వర్షాలు ఓ మోతాదులో కురిశాయి. ఆగస్టు మొదటి వారం నుంచి పూత, వేరు మొలకెత్తే దశలో వానలు కురవక.. నీరందక పంట పూర్తిగా ఎండిపోయే దశలో ఉంది. ప్రభుత్వం స్పందించి రెయిన్‌గన్లు అందజేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా 'బొజ్జ గణపయ్య' నిమజ్జనం





పూతలపట్టు రామ్‌నగర్‌కాలనీలో.. వెదురుకుప్పంలో..

పూతలపట్టు, సెప్టెంబరు 15: మండలంలోని ఎర్రచెరువుపల్లి, పూతలపట్టు రామ్‌నగర్‌కాలనీ, ముత్తిరేవుల, ఎస్వీసెట్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకస్వామి ప్రతిమలను ఆదివారం సాయంత్రం వైభవంగా నిమజ్జనం చేశారు. రామ్‌నగర్ కాలనీలోని వినాయకస్వామి విగ్రహం వద్ద ఉంచిన లడ్డూను స్థానిక టీడీపీ నేత గుంటూరు మురళి రూ.12వేలకు వేలంలో దక్కించుకున్నారు. ప్రకాష్‌రెడ్డి, రావూరి శ్రీనివాస్, కేశవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని మహారాజపురంలో గణేశుడి ప్రతిమ నిమజ్జనం కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం రాజు, మాజీ సర్పంచ్ వెంకటేసులుయాదవ్, లోకేష్‌రాజు, సతీష్‌రాజు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని బంగారుపాళ్యం దళితవాడ గ్రామస్తులు, మేజర్ పంచాయతీకి చెందిన యువకులు ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమను నిమజ్జనం చేశారు.

వెదురుకుప్పం: మండలంలో వినాయకుడి ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగించి, నిమజ్జనం చేశారు.



శివపార్వతులకు హారతి ఇస్తున్న సోమశేఖర్ గురుకుల్

వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి సహకరించండి



టీటీడీ ఈవోతో మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్





కాణిపాక వరసిద్ధుడి కల్యాణోత్సవం సందర్భంగా క్షీర కలశ ఊరేగింపులో పాల్గొన్న గోనగుంట బలిజ కులస్తులు, వణిగ వంశస్తులు







బిక్షాండిలో తొలి బోణి చేస్తున్న ఆలయ మాజీ చైర్మన్లు మణినాయుడు, జగన్నాథరెడ్డి - కళాకారుల నృత్యం - ఉరాలు వాయిస్తున్న వాయిస్తున్న కళాకారులు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 15: కాణిపాక వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి మరింత సహకరించాలని టీడీపీ ఈవో శ్యామలరావును పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. ఆదివారం వరసిద్ధుడికి పట్టువస్త్రాలను సమర్పించడానికి విచ్చేసిన టీటీడీ ఈవోతో ఎమ్మెల్యే కాసేపు ముచ్చటించారు. గతంలో స్వర్ణ రథ నిర్మాణానికి సహకరించినట్లు, ఆలయ అభ్బీధ్ధికి సహకరించాలన్నారు.

వేపనపల్లె వంకలో ఇసుకాసురులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్

పూతలపట్టు, సెప్టెంబరు 15: వేపనపల్లె గ్రామ సమీపాన ఉన్న వంకలో ఇసుకాసురులు పడ్డారు. ఇక్కడ నిత్యం వీరి మధ్య గొడవలు జరుగుతున్నా మైన్స్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు ఉన్నారన్న విమర్శలొస్తున్నాయి. గ్రామ సమీపాన పెద్ద వంక ఉంది. గతంలో కురిసిన వర్షాల కారణంగా వేలాది టన్నుల ఇసుక ఈ వంకకు చేరింది. స్థానికంగా ఉన్న కొంతమంది తమ పలుకుబడితో వంకలో ఉన్న ఇసుకను ప్రభుత్వ అధికారుల అనుమతి లేకుండా పొక్లెయిన్, ఎక్స్‌కవేటర్ పెట్టి ట్రాక్టర్ ద్వారా దంపింగ్ చేసుకుని వేరే ప్రాంతాలకు తరలిస్తూ ఇటు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ తమ జేబులను నింపుకుంటున్నారు. అలాగే రైతులకు సంబంధించిన పొలాల్లో అడ్డదిడ్డంగా దారులు ఏర్పాటు చేసుకోవడంతో గ్రామస్తులు, ఇసుకాసుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా మైన్స్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ సమాచారం అందుకున్న పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ ఆదివారం ఉదయం తమ సిబ్బందితో వంకకు చేరుకుని ఇసుకను అక్రమంగా తరలించేందుకు వినియోగించిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అంబేడ్కర్‌కి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం: ఎంపీ దగ్గుమళ్ల



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యేలు థామస్, మురళీమోహన్

పెనుమూరు, సెప్టెంబరు 15: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కి ఏమిచ్చి రుణం తీర్చుకోగలమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. ఆదివారం పెనుమూరు మండలంలోని పూణేపల్లి దళితవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో జీడీనెల్లూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు థామస్, మురళీమోహన్, మాజీ డీజీపీ సునీల్‌కుమార్, రిటైర్డ్ జడ్జి గుర్రప్ప, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామిలతో కలిసి పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల వల్లే ఆయన వారసులుగా తాము కూడా రాజకీయ రంగంలో రాణించడానికి అవకాశం లభించిందన్నారు. థామస్ మాట్లాడుతూ తన నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే తన సంకల్పమన్నారు. మురళీమోహన్ మాట్లాడుతూ.. దళితుల ఉన్నతి కోసం తాను అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. విగ్రహదాత సుబ్రహ్మణ్యం, నాయకులు రుద్రయ్యనాయుడు, హరిబాబునాయుడు, తలారిరెడ్డెప్ప, మనోహర్ రెడ్డి, కృష్ణమూర్తినాయుడు, యుగంధర్, భానుప్రకాష్, అనసూయ, మురళీనాయుడు, భాస్కర్, రాజగోపాల్‌నాయుడు, సలాం, దాము, శేఖర్, రఘుతోపాటు దళిత నాయకులు పాల్గొన్నారు. ● కాగా, శాతంబాకం పంచాయతీ రామాపురంలో నూతనంగా నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ కుంభాభిషేకం మహోత్సవంలో ఆదివారం ఎమ్మెల్యే థామస్ పాల్గొన్నారు. నిర్వాహకులు ఎంపీటీసీ యశోద, వివేక్‌లు భక్తులకు అన్నదానం చేశారు.

ప్రమాద బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్ అందజేత



శంకర్‌రెడ్డి భార్య నవనీతకు చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 15: గంగాధరనెల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే థామస్ సుడిగాలి పర్యటన సాగించారు. మొగిలిఘాట్‌లో జరిగిన ప్రమాదంలో వేపంజేరి పంచాయతీ జంగాలపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో రాజారెడ్డి కుమారుడు శంకర్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. టీడీపీనేతలతో కలిసి శంకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం తరఫున ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా పరిహారం రూ.5లక్షల చెక్‌ను మృతుడు భార్య నవనీతకు అందజేశారు. అలాగే శంకర్‌రెడ్డి కుమారుడు, కుమార్తెల చదువుకు తనవంతుగా ఆర్థికంగా తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే నెల్లికాయలగుట్టలో ఎస్టీలైన జానకి, లక్ష్మి కుటుంబాలకు చెందిన రెండు గుడిసెలు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో నాలుగురోజుల కిందట అగ్నికి ఆహుతయ్యాయి. వీరిని పరామర్శించి, తన సొంత డబ్బు ఒక్కొక్కరికి రూ.1.10 లక్షలు ఇవ్వడంతోపాటు హౌసింగ్ పథకం ద్వారా రూ.1.85లక్షలతో కొత్త ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. టీడీపీ మండలాధ్యక్షుడు స్వామిదాస్, నేతలు బాలసుబ్రమణ్యంరెడ్డి (మణిరెడ్డి), ప్రకాష్‌రెడ్డి, డి.సుబ్రమణ్యం, కృష్ణారెడ్డి, పద్మనాభరెడ్డి, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, తహసీల్దార్ చంద్రశేఖర్, హౌసింగ్, విద్యుత్‌శాఖ ఏఈలు శ్రీధర్, రాజా పాల్గొన్నారు. ● బుక్కాపట్నం దళితవాడలోని రణగారమ్మ దేవత ఆలయ కుంభాభిషేకం పూజల్లో థామస్ పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ కారకట్టి దేవరాజులురెడ్డి.. ఎమ్మెల్యేని సన్మానించారు. అలాగే రెడ్డేపల్లెకి ఎమ్మెల్యేని ఆహ్వానించి గ్రామస్తులతో కలిసి మండల టీడీపీ ఐటీడీపీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి ఘనంగా సత్కరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు. ● వరత్తూరు పంచాయతీ దళవాయిపల్లె గ్రామానికి చెందిన రైతు గోవిందరెడ్డి (67) శనివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి విద్యుత్ మోటర్‌ను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తూ బావిలో పడిమృతిచెందాడు. ఈ విషయం తెలుసుకుని ఆదివారం గోవిందరెడ్డి భౌతికకాయానికి టీడీపీనేతలతో కలిసి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులు అర్పించారు.

సన్మానం



రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడిని ఆదివారం బెంగళూరు కర్ణాటక కమ్మ సంఘం ఆధ్వర్యంలో కర్ణాటక మాజీ మంత్రి కట్టా సుబ్రమణ్యం నాయుడు సన్మానించారు.

సత్కారం



రూరల్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ ట్రాయ్ కాగ్ సభ్యుడు అయిన పి.చిట్టిబాబును బెంగళూరు శోయరాజ ఫౌండేషన్ చైర్మన్ శివరామరాజు శనివారం భారత సేవారత్న పురస్కారంతో సత్కరించారు.

- పాలసముద్రం -





పూతలపట్టు, పెనుమూరు బడుల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

'అపూర్వ' సమ్మేళనం

పూతలపట్టు/పెనుమూరు, సెప్టెంబరు 15: పూతలపట్టు ఉన్నత పాఠశాలలో 1979-80 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ● పెనుమూరు జడ్పీ హైస్కూల్‌లో 1995-96 ఏడాది పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. గురువులు చిన్నబ్బరెడ్డి, పద్మనాభనాయుడు, కృష్ణమనాయుడు, కృష్ణమ్మ, రామూర్తి, సిరాజ్‌లను సన్మానించారు. పూర్వ విద్యార్థులు కంచర్ల కుమార్, పెద్దినేని కిషోర్, గుత్తారాజేష్, సురేష్, నాగేశ్వర్‌రావు, జ్ఞాన, సుధాకర్, జగదీష్, శేషు, శివ, జయసుధ, ప్రభావతి, శ్యామల, ఉమతోపాటు మరికొందరు పాల్గొన్నారు.





శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, నగరి నియోజకవర్గ టీడీపీ నాయకుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి కుమారుడి నిశ్చితార్థానికి విచ్చేసిన మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెంగారెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

రంకేసిన కోడెగిత్తలు

ఎగువ పాతపాళ్యంలో కోలాహలంగా జల్లికట్టు



యాదమరి, సెప్టెంబరు 15: మండలంలోని ఎగువపాతపాళ్యంలో ఆదివారం టీడీపీ జిల్లా వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు విజయేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో కోలాహలంగా జల్లికట్టు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 300 ఎద్దులకుపైగా జల్లికట్టులో పాల్గొన్నాయి. తమిళనాడు రాష్ట్రం లత్తేరి బాబుకు చెందిన ఎద్దు మొదటి స్థానంలో నిలిచి రూ.లక్ష బహుమతిని గెలుపొందింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మురార్జీ యాదవ్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బోడికొండలో ఆలయ నిర్మాణ పనులపై చర్చ



నగర ప్రముఖులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 15: నగరంలోని గంగనపల్లె బోడికొండలో వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులపై వేలూరు బంగారు గుడి పీఆర్వో కళ్యాణ చక్రవర్తి, పోతుల రామ్మూర్తి, స్థపతి రత్నాచారిలతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదివారం చర్చించారు. కొండపై ఆలయ ప్రహరీ, అంతరాలయం, ఉత్సవ మంటపం, కొండపైకి దారి తదితరాలతోపాటు పలు అభివృద్ధి పనులపైనా సమీక్షించారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో త్వరలో ఓ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు నిర్ణయించారు. అలాగే నగరంలోని అన్నివర్గాల ప్రజల నుంచి సాయం కోరాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 15: డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రదోష కాల పూజలు నిర్వహించారు. నందికి, కొండ మల్లీశ్వరుడికి ఏకకాలంలో పూజలు జరిగాయి. పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 15: కాణిపాకం అగరంపల్లె ఆర్చి వద్ద ఆదివారం వేకువ జామున ఓ ఆటో బోల్తాపడి ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుడిపాల మండలం వసంతాపురం కొత్తకొత్తకోటకు చెందిన రాకేష్, పవన్, హేమంత్‌లు కాణిపాకం వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వాహనంలోని ముగ్గురూ గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఉద్యమాల్లో మహిళలే ముందుండాలి: ఐఎఫ్‌టీయూ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 15: ఉద్యమాలు, పోరాటాల్లో మహిళలు ముందుండాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. ఆదివారం ఓ కళ్యాణమండపంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికుల సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలపై కార్మికులందరు కలిసి సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తేవాలని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనాల కోసం ఉద్యమాలు చేపట్టాలన్నారు. యూనియన్ నాయకులు వెంకటరత్నం, సురేంద్రనాథ్, వెంకయియ్య, సుబ్రమణ్యం, చైతన్య, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

236 మందికి కంటి వైద్య పరీక్షలు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 15: గాంధీరోడ్డులోని లిటిల్‌రోజ్ హైస్కూల్‌లో గ్లోబల్ స్పిరిచువల్ సొసైటీ, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ బి.గోపాలకృష్ణ మూర్తి మాట్లాడుతూ.. చిత్తూరు, పరిసర ప్రాంతాల నుంచి సుమారు 236 మంది వచ్చి కంటి పరీక్షలు చేసుకున్నారన్నారు. ఇందులో 52 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారని చెప్పారు. వీరిని బెంగళూరు శంకర కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచిత ఆపరేషన్‌తోపాటు వసతి, భోజన ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. వైద్యులు దిశ అగర్వాల్, ధర్మారెడ్డి, పీఆర్వో శివప్రకాష్, రాధిక, లోహిత్‌కుమార్ పాల్గొన్నారు.

పొలాల్లో మద్యం బాటిళ్లు : ఇబ్బంది పడుతున్న రైతులు



కోదండరామాపురంలోని పొలాల్లో బాటిళ్లు

పాలసముద్రం, సెప్టెంబరు 15: రోడ్డు పక్కన పంటపొలాల్లో మందుబాబులు విచ్చలవిడిగా ఖాళీ మందు బాటిళ్లను పడేస్తున్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్తున్నారు. పాలసముద్రం మండలం తమిళనాడుకు సరిహద్దులో ఉంది. మన రాష్ట్రం కంటే మద్యం ధరలు తమిళనాడులో 20 శాతం తక్కువ. ఈ కారణంగా సమీపంలోని మందుబాబులు ఎక్కువగా అక్కడికెళ్లి మద్యం కొనుగోలు చేసి తమిళనాడు సరిహద్దు పంచాయతీలైన కోదండరామాపురం, గంగమాంబపురం, బాలకృష్ణాపురం, కృష్ణజంబాపురం, వనదుర్గాపురం, పాలసముద్రంలో రోడ్డు పక్కనున్న పంట పొలాల్లో కూర్చొని తాగుతున్నారు. మద్యం మత్తులో ఖాళీ బాటిళ్లను పొలాల్లో పడేయడమే కాకుండా వాటిని పగులగొడుతున్నారు. వీరి చేష్టలతో పంట సాగుచేయాలన్నా, పశువులు మేపాలన్నా తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మద్యం తాగుతూ రోడ్డుపై వెళుతున్న మహిళలనూ ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఇకనైనా పోలీసులు తగిన చర్యలు తీసుకుని మందుబాబుల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

రేపు విశ్వకర్మ మహోత్సవం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 15: పిళ్లారిగుడి వీధిలో నగరంలోని స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు శరవణాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచలోహ విగ్రహానికి అభిషేకం, హోమం నిర్వహించి, విగ్రహ ఊరేగింపు జరపనున్నట్లు పేర్కొన్నారు.

కొత్తూరు సమీపంలో ఒంటరి ఏనుగు

సోమల, సెప్టెంబరు 15: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ కొత్తూరు ఇర్లపల్లె ప్రాజెక్టు వద్ద ఒంటరి ఏనుగును పశువుల కాపర్లు ఆదివారం గుర్తించారు. దీంతో అక్కడి మేతకోసం వెళ్లిన పశువులను, మేకల మందలను తరుముకుని గ్రామానికి చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రాంతంలోనే గతంలో ఏనుగులు సంచరించాయి.